క్లుప్తంగా

సైబర్ నేరగాళ్లకు ముకుతాడు వేయాలి


మాట్లాడుతున్న హనీఫ్

పొదలకూరు: రోజుకో తరహాలో రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్ల ఆగడాలకు ముకుతాడు వేయాలని ఎస్సై హనీఫ్ పేర్కొన్నారు. సైబర్ భద్రతపై వెలుగు వీఓఏలు, సీసీలకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ లాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని కోరారు. గుర్తింపు పొందిన సంస్థల్లోనే రుణాలు తీసుకోవాలని సూచించారు. ట్రీస్ స్వచ్ఛంద సంస్థ గౌరవాధ్యక్షుడు నౌరాజ్, కార్యదర్శి అహ్మద్, వెలుగు ఏపీఎం చిన్నయ్య, రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీకి ఘన నివాళి



మనుబోలు: ఇందుకూరుపేట మండలంలోని వెలుగు కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న మండలంలోని పర్లపాడుకు చెందిన కూరపాటి సురేంద్ర శుక్రవారం మృతి చెందారు. బాత్‌రూమ్‌లో ఇటీవల జారిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనకు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ తరుణంలో ఆయన మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. డీఆర్డీఏ ఫైనాన్స్ డీపీఎం రవికుమార్, ఏపీఎం వనజాక్షి తదితరులు నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.25 వేలను అందజేశారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

కోవూరు : ఎక్కడైనా కోడి పందేలు, బెట్టింగులు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నిర్మలనందబాబా తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, తాగునీటి కుళాయి పన్నులను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక ఏడో డివిజన్‌లోని అరుణాచలంవారి వీధి, రైతుబజార్, జయప్రకాష్‌వీధి సచివాలయాల పరిధిలో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. డివిజన్ పరిధిలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. డివైడర్లకు, కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఇతర నిర్మాణాలకు అవసరమైన రంగులు వేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక తడికలబజార్ కూడలిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. రోడ్ల పక్కన శిథిల స్థితిలో ఉన్న వాహనాలను, నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సంబంధిత డిపార్ట్‌మెంట్ వారికి తెలియజేసి వెంటనే తొలగించాలన్నారు. స్థానికంగా పంట కాలువను ఆక్రమిస్తూ జరిగిన నిర్మాణాన్ని గుర్తించి వార్డు ప్లానింగ్ గత కార్యదర్శికి, అనధికార ఫ్లెక్సీల తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ మాల్యాద్రి, ఎస్ఈ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఓబన్న జయంతిని జయప్రదం చేయండి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో శనివారం జరుగనున్న వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో చంద్రగిరి రమణయ్య, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సింహగిరి, తిరుపాలు, సుబ్రహ్మణ్యం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పొదలకూరు: విశేషాలంకారంలో వెంకటేశ్వరస్వామి


మనుబోలు: విష్ణుమూర్తికి పూజలు


పొదలకూరు: రథాన్ని లాగుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

పొదలకూరు: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకొన్నారు. పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు. ధనుర్మాస పూజలు, తులసీ దళాలతో పూజ, గరుడసేవను నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపారు. ఉభయకర్తలుగా ప్రసాద్‌నాయుడు, పుష్పలత, వాకాటి శ్రీనివాసులురెడ్డి, సంధ్య, కోనం చిన బ్రహ్మయ్య, హైమావతి, అన్నం లక్ష్మీనారాయణ, లక్ష్మి, వెంకటప్రసాద్‌రెడ్డి, కావ్య, శివకుమార్, భారతి వ్యవహరించారు. ఆలయ చైర్మన్ పెండ్యాల రమణయ్యానాయుడు, కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, దేవరం రఘురామిరెడ్డి, శ్యామ్‌ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, మురళి, చొప్పా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

➡ పట్టణంలోని అయ్యప్పనగర్‌లో గల శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేశారు. స్వామి అమ్మవార్ల ఊరేగింపును నిర్వహించారు. కల్యాణాన్ని రాత్రి జరిపారు.

➡ పట్టణంలోని గీతామందిరంలో సుప్రభాత సేవ, గోపూజ, గీతా పారాయణం, విష్ణుసహస్రనామ పూజ, అష్టోత్తరం, మంత్రపుష్పం తదితరాలను నిర్వహించారు.

➡ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, రామ మందిరంలో పూజలు చేశారు.

➡ **ముత్తుకూరు:** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని ఈపూరు, ముత్తుకూరు, కృష్ణపట్నంలోని చెన్నకేశవస్వామి ఆలయం, నేలటూరులోని వరదరాజస్వామి ఆలయం, దొరువులపాళెం, కప్పలదొరువులో గల కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.


బుచ్చిరెడ్డిపాళెం : ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు


బుచ్చిరెడ్డిపాళెం : కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

➡ **మనుబోలు:** స్థానిక విష్ణాలయం, చెన్నకేశవాలయాలతో పాటు పిడూరు, ఎల్ఎన్‌పురం, మడమనూరులో విశేష పూజలను నిర్వహించారు. మనుబోలులోని విష్ణాలయంలో అభిషేకాలను అర్చకుడు హనుమాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవుడికి పూజలు చేశారు. స్వామివారిని గరుడ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఉభయకర్తలుగా పెనుగొండ సుదాకర్, చిట్టమూరు మధుసూదన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి ధనుంజయరెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకురెడ్డి వ్యవహరించారు.

➡ **తోటపల్లిగూడూరు:** వరిగొండలోని కోదండరామస్వామి ఆలయం, కాటేపల్లి, కోడూరులోని శివాలయాలు, తోటపల్లిగూడూరులోని శ్రీఖరేశ్వరస్వామి ఆలయం, పేడూరులోని కామాక్షి చంద్రశేఖరాలయాల్లో సందడి నెలకొంది. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

➡ **ఇందుకూరుపేట :** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని మండల వాసులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందుకూరుపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు ఉదయగిరి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కొమరికలోని చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. మంగర బాలకృష్ణారెడ్డి వ్యవహరించారు. స్వామివారి గ్రామోత్సవం వేడుకగా జరిగింది.

➡ **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చిరెడ్డిపాళెంలోని వైష్ణవ ఆలయాల్లో ముక్కోటి ఏకాదశిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దూరులోని కోదండరామస్వామి ఆలయంలో, రామకృష్ణా నగర్‌లో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.


పొదలకూరు: గ్రామోత్సవం


తోటపల్లిగూడూరు: వరిగొండలోని కోదండరామస్వామి ఆలయంలో..


బుచ్చిరెడ్డిపాళెం : క్యూలైన్‌లో భక్తులు


బుచ్చిరెడ్డిపాళెం : పెద్దూరులోని కోదండరామస్వామి ఆలయం

శాస్త్రోక్తంగా గరుడసేవ

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలోని వరదరాజస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు గరుడ సేవ శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత ఉదయం పంచామృతాభిషేకం, గర్భాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం గరుడ సేవలో స్వామివారు భక్తులను కటాక్షించారు. పల్లిపాడుకు నెల్లూరు రవీంద్రరెడ్డి-రాధమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


గరుడసేవలో స్వామివారు


ఇందుకూరుపేట : కొమరికలో..


ముత్తుకూరు: ఈపూరులో..

గండవరంలో ఫ్యామిలీ డాక్టర్


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కావ్య

కొడవలూరు : మండలంలోని గండవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి కావ్య పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్యులు ఇంటికే వచ్చి ఉచిత వైద్య సేవలందిస్తున్నందున ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎస్ సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ రోజ్ మేరీ, ఏఎన్ఎం మమత, హెచ్ఏ నాగయ్య పాల్గొన్నారు.

కార్మికులకు రూ.18 వేల వేతనమివ్వాలి


పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కోవూరు : పారిశుద్ధ్య కార్మికులకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రచార విభాగం అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ శ్రీనివాసరావుకు శుక్రవారం వినతి పత్రం శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల భద్రతను ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ద్వారా వారికి అందాల్సిన సదుపాయాలు రావడం లేదని ఆరోపించారు. వెంటనే వాటిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మావులూరు వెంకటరమణారెడ్డి, సంపత్, రమేష్, శ్రీను, బాల, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

కోవూరు : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వ్యవసాయ కార్మిక సంఘం నేతలతో కలిసి కోవూరు ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం నిరసన ర్యాలీ చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నిర్మలానందబాబాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు నందిపోగు రమణయ్య, దండూరి కామేశ్వరరావు, బొమ్మి విజయ్‌కుమార్, లక్ష్మయ్య, చెంచయ్య, డప్పు కళాకారులు కిరణ్‌కుమార్, హనుమంత్‌రావు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరులో విద్యుత్‌కు అంతరాయం నేడు

తోటపల్లిగూడూరు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఏఈ సుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం, మాచర్లవారిపాళెం, పాపిరెడ్డిపాళెం, పేడూరు, కృష్ణారెడ్డిపాళెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్) : ఏపీ జేఏసీకి అనుబంధంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్ తమ చాంబర్‌లో విడుదల చేశారు. అనంతరం వారు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డేనియల్ పీటర్‌రావు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేష్, అధ్యక్షుడు థామస్, కోశాధికారి జనార్దన్, కార్పొరేషన్ కార్యదర్శులు మొహరున్నీసా, ఖాజారసూల్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కృషి చేయండి


మాట్లాడుతున్న వెంకమరాజు

తోటపల్లిగూడూరు: వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు పేర్కొన్నారు. వచ్చే నెల్లో నిర్వహించనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని నరుకూరు సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భూమిలేని నిరుపేదలందరికీ పంచాలని, లేని పక్షంలో ఉపాధి కల్పించి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలని చెప్పారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఫిబ్రవరి ఒకటి నుంచి మూడు వరకు నిర్వహించనున్న పార్టీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు దయాకర్, కాల్తిరెడ్డి రమణమ్మ, సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, నేతలు వేగూరు వెంకయ్య, బండి శౌరి, పచ్చా మధు, మారుబోయిన రాజా, ఉండ్రాళ్ల శ్రీనివాసులు, ఐనమాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కోలాహలం


ముత్తుకూరు: చిన్నారుల ప్రదర్శన


ముత్తుకూరు: అదానీ స్కూల్లో..

పొదలకూరు: సంక్రాంతి సమీపిస్తోందంటే గ్రామీణ ప్రాంతాల్లో కోలాహలం నెలకొంటుంది. మహిళలు పోటీలు పడి ఇళ్ల ముంగిట రంగవల్లులను తీర్చిదిద్దుతుంటారు. మండలంలోని ప్రతి గ్రామంలో ముగ్గులను ఉత్సాహంగా వేస్తున్నారు.

➡ **ముత్తుకూరు:** కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. వేడుకలను పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ ప్రారంభించారు. సంప్రదాయ దుస్తులను విద్యార్థులు ధరించి, పల్లె జీవనాన్ని ప్రతిబింబించేలా పలు ప్రదర్శనలను నిర్వహించారు. పండగను స్ఫురించే వరి కోతలు, ధాన్యం నూర్పిళ్లు, ఎడ్ల బండ్లలో బస్తాలను ఇళ్లకు చేర్చడం రూపకాలను ప్రదర్శించి అలరించారు. పోర్టు సీఎస్సార్ హెడ్ రాజేష్ రంజన్, వేణుగోపాల్, మృత్యుంజయరామ్, వెంకటేష్ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

➡ **వెంకటాచలం:** వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా స్వర్ణభారత్ విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి సతీమణి ఉషమ్మ హాజరై విద్యార్థులను ఉత్సాహపర్చారు.



పొదలకూరు: చెన్నారెడ్డిపల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


వెంకటాచలం : స్వర్ణభారత్ ట్రస్ట్‌లో..